# కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు


రైతు బజారు వద్ద పూలు, పండ్ల షెడ్లను తొలగిస్తున్న సిబ్బంది

### ధర్నాకు దిగిన చిరు వ్యాపారులు

వనస్థలిపురం: వనస్థలిపురం రైతుబజారు కూడలి వద్ద రోడ్డు ఆక్రమణల తొలగింపును టౌన్ ప్లానింగ్ అధికారులు రెండవ రోజూ కొనసాగించారు. రోడ్డుపైకి వచ్చిన ఆక్రమణలనే కాకుండా రైతు బజారు ప్రహరీకి ఆనుకుని ఉన్న షెడ్లను సైతం గురువారం తొలగించారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులు ఆందోళనకు దిగారు. కేవలం మమ్మల్ని టార్గెట్ చేసుకుని తమ షెడ్లను తొలగించారని, జలమండలి కార్యాలయానికి ఆనుకుని ఉన్న దుకాణాలు, సంపూర్ణ థియేటర్ పక్కన షాపుల వారి ఆక్రమణలను ఎందుకు తొలగించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడాబాబులకు ఓ న్యాయం, మాకు ఓ న్యాయమా.. అంటూ అధికారులపై మండిపడ్డారు. మార్పు రావాలని కాంగ్రెస్


ఆందోళన చేస్తున్న చిరు వ్యాపారులు

పార్టీని గెలిపిస్తే తమ ఉపాధిని పోగొట్టారని ఎన్నో ఏళ్లుగా ఇక్కడ పూలు, పండ్లు అమ్ముతూ జీవనం సాగిస్తున్నామని, ఒక్కసారిగా తమ వ్యాపారాలను కూల్చేస్తే తాము ఎలా బతకాలని పలువురు మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం స్పందించి తమకు ఉపాధి కల్పించాలని కోరారు.


కాలనీలో పారుతున్న వరద


ఎగువన ఉన్న పొలాల నుంచి కాలనీలోకి వస్తున్న మురుగు నీరు

# ఏటేటా మునక!

- ముంపునకు గురవుతున్న శారదానగర్
- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న కాలనీవాసులు
- విస్మరిస్తున్న పాలకులు, అధికారులు

వనస్థలిపురం: వర్షాకాలం వచ్చిన ప్రతి సారీ ఆ కాలనీవాసులకు ఆందోళన తప్పడం లేదు. ఎగువనున్న కాలనీలు, పొలాల నుంచి వచ్చే మురుగునీటికి తోడు వరదనీరు చేరి కాలనీని ముంచెత్తుతోంది. ప్రతి యేడు ఇదే గోస పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరద పారిన మొదటి రోజు మాత్రమే వచ్చి ఆదుకుంటాం.. శాశ్వత పరిష్కారం చూపుతామంటున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ తర్వాత ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని వాపోతున్నారు.

**వరద కాలువ లేక..**

హయత్‌నగర్ డివిజన్ పరిధిలో 1500 ఇళ్లతో అతి పెద్ద కాలనీ శారదానగర్ కాలనీ. ఫేజ్–3 (మోహినీ ఎన్‌క్లేవ్)లో 200లకు పైగా ఇళ్లు ఉంటాయి. కాగా కాలనీకి ఎగువన ఉన్న సాహెబ్‌నగర్, పద్మావతి కాలనీ, పీవీఆర్ కాలనీ, సామనగర్, ఆంధ్రకేసరినగర్, కమలానగర్, భూలక్ష్మీనగర్, సుభద్రానగర్ తదితర కాలనీల నుంచి వచ్చే మురుగు, వరదనీరు శారదానగర్ ఫేజ్–3 మీదుగా హయత్‌నగర్ కుమ్మరికుంట, బాతుల చెరువు ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే సరైన వరద కాలువలు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎగువ నుంచి వచ్చే మురుగు, వరదనీరు శారదానగర్‌ను ముంచెత్తుతోంది. వర్షాలు కురిస్తే ఖాళీ స్థలాలు కుంటలను తలపిస్తాయి. కాలనీ ఎగువన ఉన్న పొలాలు, దిగువన ఉన్న ప్రాంతంలో నాలా అధ్వాన్నస్థితిలో ఉండడంతో దుర్వాసన, దోమలు, పాములతో సహజీవనం చేయాల్సిన వస్తోందని వాపోతున్నారు.

**నిధులు మంజూరైనా..**

శారదానగర్ నుంచి దిగువన ఉన్న నర్సింహారావునగర్ వరకు వరద కాలువ నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ నుంచి 2021లో రూ. 58 లక్షలు నిధులు మంజూరయ్యాయి. 2021 సెప్టెంబరు 22న పనులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. అయినా వివిధ కారణాలతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. టెండర్లు పిలిచి వర్క్ ఆర్డర్ ఇచ్చినా కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

### వరద కాలువను నిర్మించాలి..



వర్షాకాలంలో శారదానగర్, మోహినీ ఎన్‌క్లేవ్ చాలా ఏళ్లుగా వరద ముంపునకు గురవుతున్నాయి. వరద కాలువ నిర్మాణం పనులకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. వర్షాకాలంలో నానా ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఓపెన్ నాలాతో దుర్వాసనతో పాటు, పిల్లలకు ప్రమాదం పొంచి ఉంది. ఈ విషయంలో ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్, సంబంధిత అధికారులు స్పందించి వరద కాలువను నిర్మించాలి.

–కే.ఎల్.నర్సింహారావు, శారదానగర్ ప్రధాన కార్యదర్శి

# తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలి


రవి ముదిరాజ్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

చంపాపేట: తడి,పొడి చెత్తను వేరుచేసే స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని బీఆర్‌ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు రవి ముదిరాజ్ పేర్కొన్నారు. ఎల్‌బీనగర్ సర్కిల్ అధికారులు మంజూరు చేసిన చెత్త తరలించే రిక్షాను గురువారం ఆయన చేతుల మీదుగా చంపాపేట డివిజన్ అంజిరెడ్డి కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ...చెత్త తరలించే రిక్షా అవసరం ఉందని కాలనీవాసులు తనను కోరగా ఇదే విషయం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని దీంతో ఆయన వెంటనే స్పందించి రిక్షాను మంజూరు చేయించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు రవిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, ప్రతినిధులు సందీప్, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నర్సింహారెడ్డి, భూపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



అవగాహన సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

వనస్థలిపురం: విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్‌ను పొందవచ్చని నారాయణ పాఠశాల సీఓ విజయ్ టెక్కీ అన్నారు. గురువారం వనస్థలిపురంలో నారాయణ పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఉన్నత చదువులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని పదవ తరగతి పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి.. ఆ తర్వాత ఉన్నత విద్యావకాశాలు, ఎలాంటి విద్యను అభ్యసించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దిల్‌సుఖ్‌నగర్ ఏజీఎం హేమంబర్, జీఎం గోపాల్‌రెడ్డి, ఆర్ఐ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ భవాని, డీన్ రాధాకృష్ణ, పద్మారాణి పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను సవరించాలి


సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

లింగోజిగూడ: ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను తక్షణమే సవరించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ డిమాండ్ చేశారు. సరూర్‌నగర్ మండలంలోని సరూర్‌నగర్, కర్మన్‌ఘాట్, చంపాపేట, బహదూర్‌గూడ పాఠశాలల ఉపాధ్యాయులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు, 5 తరగతులు 60 మంది విద్యార్థుల వరకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉండాలని ఉత్తర్వులు ఇవ్వడంతో నాణ్యమైన విద్య ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.గ్రామీణ పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉన్నారని ఉపాధ్యాయులను తరలించడంతో పాఠశాలలు మూతపడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.డీఎస్సీ నియామకాలు పూర్తిచేసి ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్‌టీయూ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, సత్తు పాండు రంగారెడ్డి, నాయకులు కృష్ణ రెడ్డి, పరమేష్, రాజమణి, రాజశేఖర్,నారాయణ, నరేందర్ పాల్గొన్నారు.

### విద్యార్థి మహాగర్జనను విజయవంతం చేయాలి


అరుణ్

ఎల్‌బీనగర్: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన ఛలో హైదరాబాద్ విద్యార్థి మహాగర్జనను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్ఐ ఎల్‌బీనగర్ డివిజన్ అధ్యక్షులు కానుగుల అరుణ్ కోరారు. ఈ నెల 27న ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన మహాసభలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకులాలు, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు.

### ఆర్టీసీ అభివృద్ధికి పాటుపడాలి

చైతన్యపురి: ఆర్టీసీ అభివృద్ధికి సిబ్బంది కలిసికట్టుగా కృషి చేయాలని దిల్‌సుఖ్‌నగర్ సిటీడిపో మేనేజర్ టి.సమత అన్నారు. ఆగస్టు నెలలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి గురువారం డిపోలో జరిగిన కార్యక్రమంలో డీఎం క్యాష్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# నేటి నుంచి టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్

మలక్‌పేట: హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజీ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఈనెల 27 తేదీ నుంచి నారాయణగూడ వైఎంసీఏ టేబుల్ టెన్నిస్ అకాడమీలో నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ జూనియర్ కాలేజీ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, పి.జక్కయ్య తెలిపారు. టోర్నీలో అండర్–19 బాల బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయిలో పాల్గొనే జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు 70320 57633 సెల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

మన్సూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (జీఎస్ఐటీఐ) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. మాథ్యూజోసెఫ్, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ చామ సంపూర్ణ విజయశేఖర్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆర్‌కేనగర్ రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.


చెత్తను తొలగిస్తున్న జీఎస్ఐ డీడీజీ మాథ్యుజోసఫ్

# ప్రేమ పేరుతో వేధించిన యువకుడికి మూడేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: ప్రేమించాలని వేధించిన కేసులో యువకుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.7 వేల జరిమానా విధించారు. ఏపీపీ సునితా బర్ల వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్ ఠాణా పరిధిలో నివాసముండే మైనర్ బాలిక(15) స్థానికంగా పదో తరగతి చదువుతోంది. పాఠశాలకు వెళ్లే సమయంలో ఎర్ర రమేశ్ (20) తనని ప్రేమించాలంటూ వేధించేవాడు.విద్యార్థిని తండ్రికి విషయం చెప్పడంతో ఇద్దరు కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను పరిశీలించిన రంగారెడ్డి జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి రమేష్‌కు మూడేళ్ల కారాగార శిక్షతో పాటు రూ.7వేల జరిమానా, బాధితురాలికి రూ.లక్ష నష్ట పరిహారం చెల్లించాలని గురువారం తీర్పునిచ్చారు.

### అరెస్టు వారెంట్ జారీ చేస్తామంటూ రూ.1.49 లక్షలు కాజేశాడు

నాగోలు: మీ ఫోన్ నంబర్ మోసపూరిత జాబితాలో చేర్చబడింది.. నాన్ బెయిలబుల్ కేసులో అరెస్టు వారెంట్ జారీ చేస్తామని బెదిరించి ఓ వ్యక్తి నుంచి రూ. 1.49 లక్షలు కాజేసిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్ ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన మధుసూదన్‌రెడ్డికి ఈ నెల 25న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేశాడు. టెలీకామ్ రెగ్యులటరీ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి మాట్లతున్నామని మీ ఫోన్ నెంబర్ బ్లాక్ చేయడుతుందని చెప్పాడు. మొబైల్ నంబర్ పేరు మోసపూరిత జాబితాలో చేర్చబడిందని మీపై 17 కేసులు ఉన్నాట్లు చెప్పాడు. అనంతరం వీడియో కాల్ చేసి అతని ఖాతా బ్లాక్ చేస్తామని బెదిరించాడు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం డబ్బులు బదిలీ చేయాలని కోరడంతో భయపడిన మధుసుదన్‌రెడ్డి తన ఖాతా నుంచి రూ.1.49 లక్షలను బదిలీ చేశాడు. ఆ తర్వాత ఎలాంటి సమాచారం రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# భారతీ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం వేగవంతం


తాపీ మేస్త్రీలకు బహుమతులు అందజేస్తున్న బద్రీ

మన్సూరాబాద్: మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతీ అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రీ అన్నారు. మన్సూరాబాద్ జై హనుమాన్ సిమెంట్ ఏజెన్సీలో గురువారం తాపీ మేస్త్రీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతీ సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ 5 స్టార్ గ్రేడ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందని తెలిపారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి సరైన ఎంపికన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు నిపుణులైన భారతీ సిమెంట్ సంస్థ ఇంజినీర్లు సైటు వద్దకే వచ్చి ఉచితంగా సాంకేతిక సహాయం అందిస్తారన్నారు. డీలర్ నరేష్ మాట్లాడుతూ.. భారతీ సిమెంట్ సంస్థ సర్వీస్ వేగంగా ఉందన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు బహుమతులు అందజేశారు.

### వరద బాధితులకు శాంతినికేతన్ విద్యా సంస్థల విరాళం


సీఎంకు చెక్కు అందజేస్తున్న రాధాకృష్ణ

లింగోజిగూడ: వరద బాధితలు సహాయార్థం శాంతినికేతన్ విద్యా సంసంస్థల ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు చైర్మన్ రాధాకృష్ణ రూ.9.01 లక్షలను సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు.ఈ కార్యక్రమంలో శేషరావు, సుధీర్, రంగా శ్రీనివాస్‌రావు, ధనుంజయ పాల్గొన్నారు.

### ఢిల్లీ వాల్డ్ పబ్లిక్ స్కూల్‌కు డైనమిక్ అవార్డు


అవార్డుతో నిర్వాహకులు

లింగోజిగూడ: తుర్కయంజాల్ మన్నెగూడలోని ఢిల్లీ వాల్డ్ పబ్లిక్ స్కూల్‌కు దీ డైనామిక్ స్కూల్ అవార్డ్ వరించింది. ఈ నెల 25న నగరంలో జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల ఎడ్యుకేటర్స్ సమ్మిట్‌లో ఎడ్యుకేషన్ న్యూస్ నెట్‌వర్క్, ఎడ్యుకేషన్ టూ డే సంస్థలు ఈ అవార్డును ప్రకటించాయి. పాఠశాల ప్రిన్సిపాల్, అకాడమిక్ డైరెక్టర్ మారుతీ రాంప్రసాద్‌కు అవార్డును అందజేరు. ఈ సందర్భంగా మారుతీ రాంప్రసాద్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సిబ్బందికి కృతజ్ఞతలు అన్నారు.

# ఐలమ్మ పోరాటం.. నేటి తరానికి స్ఫూర్తిదాయకం


ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


చింతలకుంటలో ఐలమ్మ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న రామ్మోహన్‌గౌడ్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ బీజేఆర్ భవన్ వద్ద చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి హాజరై ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో అలుపెరుగని పోరాటం చేసిన వీరనారి ఐలమ్మ అన్నారు. ఐలమ్మ సమ సమాజ నిర్మాణం కోసం బలహీన వర్గాల అభ్యున్నతికై అకుంఠిత దీక్షతో రజాకార్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన విప్లవ యోధురాలు అని కొనియాడారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు. ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్ నేత, పి. సైదులు, జ్ఞానేశ్వర్ యాదవ్, యాదవరెడ్డి, ఎల్లన్న, కళ్యాణ్, లింగస్వామి, మహేందర్ పాల్గొన్నారు.

**చింతలకుంట చెక్‌పోస్ట్ వద్ద..**

వనస్థలిపురం: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను గురువారం ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఎల్‌బీనగర్ చింతలకుంట చెక్‌పోస్ట్ వద్ద చాకలి ఐలమ్మ ఐక్యవేదిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి. సీపీఐ నాయకులు బాతరాజు నర్సింహా తదితరులు హాజరై ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతు.. ఐలమ్మ పోరాటం నేటి యువతకు ఆదర్శమని, ఆమె చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ప్రచురించాలన్నారు.


ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాఘవాచారి

**చంపాపేట చౌరస్తాలో..**

చంపాపేట: భూమి, భుక్తికోసం పెత్తందారులు, రజాకార్లపై రైతాంగ సాయుధ పోరాటాలు చేసిన మడమ తిప్పని పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని బీఆర్‌ఎస్ నాయకుడు ఇంజమూరి రాఘవాచారి అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు బైగళ్ల రాము ఆధ్వర్యంలో చంపాపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై పలు పార్టీ నాయకులతో కలిసి ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రాము, లక్ష్మణ్, ఈశ్వర్‌గుప్తా, శ్రీపాల్‌రెడ్డి, కిరణ్, ఈపూరి భద్రీనాథ్, శివ, వెంకటేష్ పాల్గొన్నారు.

**నాగోలు చౌరస్తాలో..**

నాగోలు: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటాల్సిన బాధ్యత మనందరిపై ఉందని టీపీసీసీ ప్రచార కమిటి కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా తెలిపారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నాగోలు చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఐలమ్మ చిత్ర పటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం కన్వీనర్ బొడ్డుపల్లి కృష్ణ, రజక అభివృద్ధి సంస్థ సహాయ కార్యదర్శి చక్కయ్య, సీపీఐ పార్టీ నాయకులు రవీంద్రచారి, నాయకులు రమేష్, శ్రీకాంత్, వినయ్, కార్తిక్, చైతన్య పాల్గొన్నారు.



సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో..


ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న శ్రీనివాస్‌గుప్తా


నివాళులర్పిస్తున్న సామ రంగారెడ్డి

# వ్యాపారాల వైపు అడుగేసేలా..

- 'ఇందిరా మహిళాశక్తి' ద్వారా 14 యూనిట్ల రుణాలు
- ఆసక్తి కనబరుస్తున్న మహిళలు


అవగాహన కల్పిస్తున్న అధికారులు

చాదర్‌ఘాట్: వివిధ వ్యాపారాలతో మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళాశక్తి పథకానికి శ్రీకారం చుట్టింది. మహిళల ఆర్థిక స్వాలంబన లక్ష్యంగా తమ కాళ్లపై తాము నిలబడుతూ మరింత మందికి ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేసింది. ఆధునిక మార్కెట్‌కు తగినట్టు లాభాలను ఆర్జించే వ్యాపారాలను ప్రోత్సహించి మహిళలతో సంపద సృష్టించడమే ఈ పథకం లక్ష్యం. జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 పరిధిలోకి వచ్చే అజంపురా, ఓల్డ్‌మలక్‌పేట, మూసారాంబాగ్, అక్బర్‌బాగ్, సైదాబాద్ డివిజన్ల పరిధిలో జీహెచ్‌ఎంసీ యూసీడీ విభాగం ఆధ్వర్యంలో 14 రకాల యూనిట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

**రూ.20 లక్షల వరకు..**

మహిళల జీవనోపాధిని మెరుగుపరిచి వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఈ పథకాన్ని వ్యక్తిగతం, సామూహికంగా అమలు చేస్తున్నారు. యూనిట్లకు అనుగుణంగా రూ. 3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు అందిస్తున్నారు. బ్యాంక్ లింకేజీతో పాటు స్త్రీనిధిలో సైతం రుణాలను కేటాయిస్తున్నారు. క్యాంటీన్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌ల నిర్వహణపై 10 రోజుల నైపుణ్య శిక్షణతో పాటు మరో 12 రకాల యూనిట్లను పంపిణీ చేస్తున్నారు.

**అవగాహన కల్పిస్తూ..**

జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 పరిధిలో మహిళా సంఘాలకు ఇందిరా మహిళాశక్తి యూనిట్లను కేటాయిస్తున్నామని సర్కిల్–6 డీపీఓ యుగేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం వీటిని ఆన్‌లైన్ చేస్తున్నామని వ్యాపారం ఎలా చేసుకోవాలో అవగాహన కల్పిస్తున్నాం. ఈ వ్యాపారాలకు అర్హులను గుర్తించి బ్యాంక్ లింకేజీని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**ఇవి యూనిట్లు..**

కిరాణషాపులు–8, చికెన్ సెంటర్–1, క్యాటరింగ్–1, టిఫిన్ సెంటర్లు–5 కూరగాయాల వ్యాపారాలు–4, టైలరింగ్–10, చీరల వ్యాపారం–8, డ్రైక్లీనింగ్ సెంటర్లు–1, బియ్యం దుకాణం–2, బ్యూటీ పార్లర్లు–4, జిరాక్స్ మిషన్–2, ఫాన్సీ స్టోర్–2.

# వీధి కుక్కల స్వైర విహారం

పలువురిపై దాడులు




కుక్కకాటు చూపుతున్న రామచంద్రయ్య ,విద్యార్థిని గాయత్రీ

మన్సూరాబాద్: వీధి కుక్కల దాడులతో కాలనీవాసులు బెంబేలెత్తుతున్నారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి విజయనగర్‌కాలనీలో గత కొన్ని రోజులుగా కుక్కలు కాలనీవాసులపై దాడులకు తెగబడుతున్నాయి. కాలనీకి చెందిన పలువురు కుక్క కాట్లతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. చిన్న పిల్లలు, విద్యార్థులు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఫిర్యాదు చేసిన తూతూ మంత్రంగా వచ్చి ఫిర్యాదు ముగిసిందని సంతకం తీసుకుని వెళ్లిపోతున్నారని స్థానికులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.